# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 30-4-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:206 పేజీలు:6 వెల: రూ.1/-


## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**-ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ట్రక్కు ఢీకొనడంతో పది మంది మృతి**


రాయ్‌పూర్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బెమెతారా ప్రాంతంలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని ట్రక్కు ఢీకొనడంతో పది మంది మృతి చెందారు.

ఈ ప్రమాదంలో 23 మంది గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో రాయ్‌పూర్‌లోని ఎయిమ్స్ ఆస్పత్రికి తరలించారు. తిరైయా గ్రామంలో ఓ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతులది పతర్రా గ్రామంగా గుర్తించారు. మృతులలో ఐదుగురు మహిళలు, ముగ్గురు పిల్లలు, ఇద్దరు పురుషులు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు.

## చురక

రాజ్యం రక్తపింజరి
రూపాన్ని దాల్చుతుంది
ప్రజాస్వామ్య రక్తాన్ని
ప్రతీరోజు పీల్చుతుంది.

ఆపగలమా లేదా అనే
అధైర్యం ఇంకెందుకు
బ్రహ్మాస్త్రమే మన ఓటు
పదవేల ఇక ముందుకు



-వేల్పుల
నారాయణ

# కాంగ్రెస్ పార్టీలో చేరిన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు



హైదరాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు అమిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసిసి ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో అమిత్ కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసిసి కార్యదర్శ రోహిత్ చౌదరి, డిసిసి అధ్యక్షుడు రోహిన్ రెడ్డితో కలిసి అమిత్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. జూబ్లీహిల్స్ నివాసంలో తన అమిత్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి రేవంత్ ఆహ్వానించారు. బీఆర్ఎస్ సీనియర్ నేత, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సైతం గత కొంత కాలంగా పార్టీ అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నారు. నల్లగొండలో గుత్తా సుఖేందర్- జగదీశ్ రెడ్డి మధ్య కోల్డ్ వారు నడుస్తోందని పార్టీ శ్రేణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గుత్తా ఫ్యామిలీ కాంగ్రెస్ గూటికి వెళుతుందని ప్రచారం జరిగి ంది. ఇప్పుడు అమిత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరడంతో అది నిజమైంది.

# నేడే టెన్త్ రిజల్ట్స్.. రిలీజ్ చేయనున్న తెలంగాణ విద్యాశాఖ

హైదరాబాద్, ఏప్రిల్ 29: : తెలంగాణలో రేపు టెన్త్ ఫలితాలు విడుదల కానున్నాయి. పరీక్ష పేపర్ల మూల్యాంకనం, కంప్యూటరీకరణ కూడా పూర్తికావడంతో ఫలితాలను విడుదల చేసేందుకు తెలంగాణ విద్యాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు ఫలితాలను ఆన్‌లైన్‌లో ప్రకటిస్తారు. పదో తరగతి ఫలితాల ప్రకటనకు ఎన్నికల సంఘం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 10వ తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించారు? మొత్తం 5.08 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో బాలురు 2,7,952 మంది, బాలికలు 2,50,433 మంది ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మరోవైపు పరీక్షలు జరుగుతుండగానే.. ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 13 వరకు 19 కేంద్రాల్లో పరీక్ష పేపర్ల మూల్యాంకనం పూర్తి చేశారు.. అనంతరం కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియ కూడా ముగించారు..

https://results.cgg.gov.in ని వెబ్‌సైట్‌ను క్లిక్ చేయడం ద్వారా తెలంగాణ పదవ ఫలితాలను తెలుసుకోవచ్చు. విద్యార్థుల హాల్‌టికెట్ నంబర్‌ను నమోదు చేస్తే, ఫలితాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. ఫలితాలతోపాటు మార్కుల మెమో ఉంటుంది. గతేడాది రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 13న ముగియగా.. మే 10న ఫలితాలు విడుదలయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి 15 రోజుల ముందుగానే పరీక్షలు పూర్తయ్యాయి.

# తెలంగాణను భ్రష్టు పట్టించి కోట్లు కొల్లగొట్టారు : మంత్రి సురేఖ

**-ఎంపీ అభ్యర్థి నీలం మధు ప్రచారం**
**-ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు**
**-మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, ఇన్చార్జి నర్సిరెడ్డిలతో కలిసి ఎంపీ అభ్యర్థి ప్రచారం..**
**-తెలంగాణను భ్రష్టు పట్టించి కోట్లు కొల్లగొట్టారు**
**-కార్నర్ మీటింగ్ లో మంత్రివర్యులు కొండా సురేఖ**



మెదక్, ఏప్రిల్ 29: మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ఎన్నికల ప్రచారం సోమవారం గజ్వేల్ నియోజకవర్గం కొండపాకలో కోలాహలంగా మొదలైంది. రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి, పార్లమెంట్ ఇంచార్జి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఎంపీ అభ్యర్థి నీలం మధు, మాజీ ఎమ్మెల్యే ఇన్చార్జి నర్సిరెడ్డి, మెదక్ డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్, మాజీ హౌసింగ్ కార్పొరేషన్ భూనీరెడ్డి తదితరులకు కాంగ్రెస్ పార్టీ నేతలు, నాయకులు ఘన స్వాగతం పలికి, వారిని సత్కరించారు, అనంతరం కొండపాక సెంటర్ వరకు రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ ఎంపీ అభ్యర్థి నీలం మధుతో కలిసి ప్రచార రథంలో అభివాదం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, కొండపాక మాజీ సర్పంచ్ చిట్టి మాధురి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వాసవి లింగరావు, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అంక్ష, లీలావతి, మల్లిఖార్జున్, హరీఫ్, వెంకట్, ఆనంతుల నరేందర్, చిన్న శ్రీనివాస్, మహదేవ్, చిరంజీవి , ఎరుపుల మల్లేశం, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణను భ్రష్టు పట్టించి? కోట్లు కొల్లగొట్టారు : మంత్రి సురేఖ

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించి, కోట్ల రూపాయలు కొల్లగొట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి, మెదక్ పార్లమెంటు ఇన్చార్జి కొండా సురేఖ అన్నారు. ఎంపీ అభ్యర్థి నీలం మధు ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గం కొండపాకలో కార్నర్ మీటింగ్ లో మంత్రి కొండా సురేఖ మాట్లాడారు. కెసిఆర్ కాళేశ్వరం, మేడిగడ్డ, సుందిళ్ల వంటి ప్రాజెక్టులలో కోట్ల రూపాయల పర్సెంటేజీలు తీసుకుని, వారి అవసరాల నిమిత్తమే పనులు చేశారని విమర్శించారు. మాజీ సీఎం కెసిఆర్ బయట పనులు వ్యవహారం చక్క దిద్దితే, ఆయన కుమారుడు కేటీఆర్ షాడో సీఎంగా పనిచేశారని పేర్కొన్నారు. ఆయా పనుల ప్రస్తావనకు సంబంధించి వారిని ప్రశ్నిస్తే తప్పించుకునే వారన్నారు. మంచి జరిగితే ఇది మావల్లే సాధ్యమైందని, చెడు జరిగితే ఎదుటి వాళ్ల మీదకు నెట్టేలా రాజకీయం చేశారని విమర్శించారు. ప్రచారంలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి గజ్వేల్ నియోజకవర్గానికి విచ్చేసిన తనకు ఈ ప్రాంతాన్ని కెసిఆర్ ఏం అభివృద్ధి చేశాడో? కనిపించలేదన్నారు. కనీసం రోడ్లు కూడా సరిగా వేయించని కెసిఆర్ ఈ తెలంగాణ రాష్ట్రాన్ని ఏ విధంగా పాలించాడో ? ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాళేశ్వరం చూస్తే కృంగిపోయింది, మేడిగడ్డ బ్యారేజీ డ్యామేజీ అయింది, వాటిని చూసేందుకు వెళితే మాజీ సీఎం కేసీఆర్ అవహేళనగా మాట్లాడుతున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కరెక్టుగా డిజైన్ చేసి ఉంటే తెలంగాణ ప్రజలంతా సంతోషించే వారిని పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి జరిగిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆమె కోరారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తున్న నీలం మధును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.

### వల్లకాడు చేసిండు.. మైనంపల్లి హనుమంతరావు

మెదక్ ను మాజీ మంత్రి హరీష్ రావు వల్లకాడు చేశాడని మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండపాక కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు హరీష్ రావు కేవలం ఫోటోలకు ఫోజులిచ్చి, హైదరాబాదులో తేలేవాడని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పాలనలో మార్కెట్ కమిటీలను కూడా ఏర్పాటు చేయలేదని విమర్శించారు. 10ఏళ్ల ఇక్కడ నాయకుల మధ్య పంచాయతీలు పెట్టించడానికే హరీష్ రావుకు సరిపోయిందని దుయ్యబట్టారు. ఈ ఎన్నికల్లో బీసీ సామాజిక వర్గానికి చెందిన నీలం మధును గెలిపించి, బీఆర్ఎస్ కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

### కాంగ్రెస్ తోనే మేలు.. నీలం మధు

లోక్ సభ ఎన్నికల్లో తనను గెలిపించి, ప్రజాసేవ చేసుకునే అవకాశం ఇవ్వాలని ఎంపీ అభ్యర్థి నీలం మధు ఓటర్లను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారాలలో భాగంగా కొండపాక కార్నర్ మీటింగ్ లో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు భూములు, ఇండ్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని తెలిపారు. ఈ దేశంలో రానున్నది కూడా ఇండియా కూటమిదే అధికారమని స్పష్టం చేశారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# ఆర్టికల్ 370 టచ్ చేస్తే కశ్మీర్ అగ్నిగుండం అవుతుందని రాహుల్ హెచ్చరించారు : అమిత్ షా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్ షా సోమవారం బిహార్‌లోని బెగుసరాయ్‌లో జరిగిన ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ కశ్మీర్ మనదని, కశ్మీర్‌తో రాజస్థాన్, బిహార్‌కు ఏం సంబంధం అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అంటున్నారని పేర్కొన్నారు.

కాంగ్రెస్, లాలూ ప్రసాద్ యాదవ్ గత 70 ఏండ్లుగా ఆర్టికల్ 370ని తమ అక్రమ సంతానంలా జాగ్రత్తగా చూసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి రెండోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆర్టికల్ 370 రద్దు చేశారని గుర్తుచేశారు.

ఆర్టికల్ 370ని రద్దు చేస్తే కశ్మీర్‌లో రక్తపుటేరులు పారతాయని హెచ్చరించారని అన్నారు. అయితే గత ఐదేండ్లుగా ఒక్క చిన్న రాయి కూడా ఎవరూ విసరలేదని అమిత్ షా గుర్తుచేశారు.

# మోడీని అనర్హునిగా ప్రకటించాలంటూ దాఖలైన పిటిషన్ తిరస్కృతి

న్యూఢిల్లీ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ప్రధాని నరేంద్ర మోడీని ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హునిగా ప్రకటించాలంటూ దాఖలైన వినతిని ఢిల్లీ హైకోర్టు తిరస్కరించింది. ఉత్తర్ ప్రదేశ్ లోని పిలిభిత్ లో ఇటీవల ఇచ్చిన ప్రసంగంలో దేవుడు, మందిరం పేరిట ఆయన ఓట్లు కోరి, ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంటూ ఆయనపై అనర్హత వేటేయాలని వినతిలో పేర్కొన్నారు .అర్జీదారుడి విషయాన్ని ఎన్నికల సంఘం చూడాల్సి ఉండగా ఆయన కోర్టును ఆశ్రయించడం పూర్తిగా దురుద్దేశంతో కూడిందని కోర్టు అభిప్రాయపడింది. న్యాయమూర్తి సచిన్ దత్తా ఆయన వినతిని కొట్టివేశారు. ఇటీవల రాజస్థాన్ లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ ముస్లింలను 'చొరబా టుదారులు' అనడానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఇటీవల ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. "తల్లులు, సోదరీమణుల బంగారం లెక్కలేసి, సంపద సమాచారాన్ని సేకరించి, దానిని పున:పంపిణీ చేస్తానని కాంగ్రెస్ మేనిఫెస్టో పేర్కొంది. వారు ఎవరికి పున:పంపిణీ చేస్తారు? ఇదివరలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం దేశ సంపదపై ముస్లింలదే ప్రధాన హక్కు అని అన్నారు" అని మోడీ తన ప్రసం గంలో పేర్కొన్నారు. 'మీ కష్టార్జితం చొరబాటుదారులకు పోవాలా దానిని మీరు ఆమోదిస్తారా' అని కూడా మోడీ ప్రసంగంలో ప్రశ్నించారు. దీనిపై ఎన్నికల సంఘం బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాకు నోటీసులు జారీ చేసింది. స్టార్ ప్రచారకులు తమ ప్రసంగంలో సంయమనం పాటించాలని పేర్కొంది.

# రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకు మండుతున్నా ఎండలు

హైదరాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బయటకు వెళ్లాలంటే భానుడి భగభగలు చెమటలు పుట్టిస్తున్నాయి. అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లడం లేదు. ఇలాంటి పరిస్థితులతో నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. అయితే ఎండ కేవలం మనుషులకే కాదు వాహనాలను సైతం బేజారెత్తేలా చేస్తుందని ఆటో మొబైల్ రంగ నిపుణులు, మెకానిక్‌లు చెబుతున్నారు. వాహనాలను బయట వదిలితే.. అవి కొద్దికాలంలోనే రంగు, రూపు కోల్పోవడమే కాకుండా తరుచూ మరమ్మతులకు గురికావాల్సి వస్తుందని నిపుణులు చెబుతున్నారు.కార్ల వంటి వాహనాల లోపలి భాగాలు కూడా తీవ్రంగా దెబ్బతింటాయంటున్నారు. వాహనాలు అసలు రంగు, మెరుపును కోల్పోతాయి. టైర్లు, సీట్లు, బ్యాటరీ, ఇంజిన్ లోపలి సున్నిత బాగాలు దెబ్బతింటాయి. ఇంధనం ఆవిరయ్యే ఆస్కారముంటుంది. కార్లలో ప్రమాదాల్లో కాపాడే ఎయిర్ బ్యాగ్‌లు కూడా దెబ్బతింటాయి. సీట్ల కుషన్లు, కవర్లు, అద్దాలు బలహీనమవుతాయని మెకానిక్‌లు చెబుతున్నారు. రోజుల తరబడి ఎండలో నిలిపితే కార్ల బాడీ కూడా దెబ్బతింటుంది.

జాగ్రత్తలు పాటించాలి

ఎండలో వాహనాలను నిలపాల్సి వస్తే తరుచూ వాటిని నీటితో శుభ్రం చేయడం, అద్దాలకు అడ్డుగా ప్యాడ్‌లను కట్టడం, మొత్తం వాహనాన్ని చుడుతూ కవర్లు బిగించడం ఉత్తమం. ఎండాకాలంలో ప్రతీ వాహనదారుడు కచ్చితంగా తరుచూ టైర్లు, బ్యాటరీలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవడం తప్పనిసరని ఆటో మొబైల్ నిపుణులు నాయుడు తెలిపారు.

ఎండ నుంచి రక్షణ కల్పించే కోటెడ్ వ్యాక్స్ వాడటం మంచిదని తెలిపారు. అలాగే ఫిల్మ్ కూడా అందుబాటులో ఉంది. అవకాశం ఉంటే తప్పనిసరిగా వాహనాన్ని నీడలో నిలిపే ప్రయత్నం చేయాలని సూచించారు. ప్రతీరోజు తరుచూ శుభ్రం చేయాలి. ఎక్కువ కాలం ఎండలో నిలిపిన వాహనాలను తిరిగి వినియోగించేటప్పుడు విధిగా టైర్లలో గాలి చెక్ చేసుకోవాలని సూచించారు.అలాగే బ్యాటరీ, ఇంధన ట్యాంకులు కూడా సరిచూసుకోవాలని చెప్పారు. అంతేకాదు ఉష్ణోగ్రతల కారణంగా కార్లలో ఇటీవల మంటలు వ్యాపిస్తున్నాయి. ఎలక్ట్రిక్ అమరికల కారణంగా ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో వాహనాల బాడీ స్టీల్‌తో నిర్మించేవారు. ప్రస్తుతం వేగంగా దూసుకెళ్లేందుకు, మైలేజీ పెంచేందుకు ఫైబర్, ప్లాస్టిక్ వినియోగం పెరగడం వల్ల కార్లు త్వరగా దగ్ధమవుతున్నాయి. నాసిరకం ఎలక్ట్రికల్ పరికరాలను ఉపయోగించడం కూడా ప్రమాదాలకు తావిస్తున్నాయి. సామర్థ్యానికి మించి లోడ్ పడినప్పుడు షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఎన్నికల వేళ అమిత్ షా నకిలీ వీడియోలు కలకలం..

**- ఎఫ్ఐఆర్ నమోదు..**

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్)ఎన్నికల వేళ కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు సంబంధించిన ఫేక్ వీడియోలు సోషల్ మీడియాలో కలకలం సృష్టిస్తున్నాయి. ఈ ఫేక్ వీడియోలపై ఢిల్లీ పోలీసులు స్పందించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తాజాగా వెల్లడించారు.అమిత్ షా ఇటీవలే తెలంగాణలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ విరుద్ధమైన ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీకు చెందిన ఆ హక్కులను తిరిగి వారికే ఇచ్చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, షా ప్రసంగాన్ని కొందరు వక్రీకరించి.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పినట్లు ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. దీనిపై బీజేపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణలో ముస్లింలకు రాజ్యాంగ విరుద్ధమైన రిజర్వేషన్లను తొలగించాలని మాత్రమే అమిత్ షా మాట్లాడారని స్పష్టం చేసింది. పూర్తిగా ఎడిట్ చేసిన వీడియోను వ్యాప్తి చేస్తున్నారని, ఇది పెద్ద ఎత్తున హింసకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.మరోవైపు సోషల్ మీడియాలో వైరలవుతున్న షా ఫేక్ వీడియోపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ మేరకు నకిలీ వీడియోలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. హోంశాఖ ఫిర్యాదు మేరకు ఢిల్లీ పోలీసులు తాజాగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# దేశంలోని పలు ప్రధాన ఎయిర్‌పోర్ట్స్‌కు బాంబు బెదిరింపులు

న్యూ ఢిల్లీ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);దేశంలో బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. ఇవాళ దేశంలోని పలు ప్రధాన ఎయిర్‌పోర్ట్స్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఆయా విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సోమవారం ఉదయం రాజస్థాన్‌లోని జైపూర్ , మహారాష్ట్రలోని నాగ్‌పూర్ , గోవా విమానాశ్రయాలకు ఈమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వెంటనే ఆయా విమానాశ్రయాల అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అధికారులు బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో ఆయా విమానాశ్రయాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే, ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు కనిపించలేదని పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు బెదిరింపు మెయిల్స్ నేపథ్యంలో ఆయా విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈమెయిల్ పంపిన వారి కోసం గాలిస్తున్నారు. అయితే, ఆయా విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు ఎలాంటి అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు.

కాగా, దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా చెన్నై, ముంబైలోని పలు పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. అంతేకాదు, పలు విమానాశ్రయాలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఇలా దేశంలోని పలు పాఠశాలలు, ప్రముఖ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి వరుస బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది

# కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు తృటిలో తప్పిన ప్రమాదం

పాట్నా ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన బిహార్లో పర్యటించారు. బెగుసరాయ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా పాల్గొన్నారు.

సభ అనంతరం తిరిగి వెళ్తున్న సమయంలో అమిత్ షా హెలీకాప్టర్‌లో బయలుదేరారు. ఈ సమయంలోనే హెలీకాప్టర్ బ్యాలెన్స్ కోల్పోయింది.

చివరకు హెలీకాప్టర్ సురక్షితంగా టేకాఫ్ అయ్యింది. అయితే, వ్యవహారంపై అధికారులు విచారణ చేపట్టారు.కేంద్ర హోంశాఖ మంత్రిగా ఉన్న అమిత్ షాకు ఏర్పాటుచేసిన హెలీకాప్టర్‌కు సంబంధించిన వివరాలను సైతం అధికారులు ఆరా తీస్తున్నారు.

బ్యాలెన్స్ కోల్పోవడానికి కారణాల తెలియరాలేదు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అమిత్ షా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. కేంద్రంలోని మరోసారి అధికారాన్ని సాధించేందుకు ఆయన కృషి చేస్తున్నారు.

ఈ క్రమంలో ఆయన బిహార్ వెళ్లారు. హెలీక్యాప్టర్ బ్యాలెన్స్ కోల్పోవడం కలకలం సృష్టించింది.ఆ తర్వాత పరిస్థితి చక్కబడడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఈ ప్రమాదానికి ముందు ఆయన బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ అంశంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. కాంగ్రెస్, లాలూ ప్రసాద్ యాదవ్ 70 ఏళ్లుగా ఆర్టికల్ 370ని తమ అక్రమ సంతానంగా చూశారని.. మోదీ రెండోసారి ప్రధానమంత్రి అయ్యాక ఆ ఆర్టికల్‌ను రద్దు చేశారన్నారు. పొరపాటున ఇండియా కూటమి గెలవదని, భారత్‌కు బలమైన వారు కావాలని.. బలహీనులు కాదన్నారు.


నేటి కందం- నేటికీ అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం


ప్రతియొక్క భారతీయుం
దతులితమైనట్టి కరణి ఆయుష్మాన్ భా
రత దివసము నీదినమున
వ్రతముగ జరుపంగవలయు స్వాస్థ్యము నొందన్

(ఏప్రియల్ 30 ఆయుష్మాన్ భారత్ దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

# హైదరాబాద్‌లో తమిళి సై.. 10 రోజులు పాటు ఇక్కడే మకాం

హైదరాబాద్, ఏప్రిల్ 29: బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసేందుకు తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై నేడు హైదరాబాద్ కు చేరుకున్నారు.. చెన్నై నుంచి హైదరాబాద్ కు చేరుకున్న ఆమెకు రైల్వే స్టేషన్ లో బిజెపి నేతలు , కార్యకర్తలు స్వాగతం పలికారు.

కాగా, పది రోజులకు పైగా ఆమె ఇక్కడే ఉండి ప్రచారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆమెతో పాటు తమిళనాడు బీజేపీకి చెందిన కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చారు. ఇది ఇలా ఉంటే తెలంగాణ గవర్నర్‌గా రిజైన్ చేసిన ఆమె తమిళనాడులోని చెన్నై సౌత్ లోక్ సభ స్థానం నుంచి బరిలోకి దిగారు.. ఇక్కడ మొదటి దశలోనే ఎన్నికలు పూర్తి కావడంతో ఆమె తెలంగాణలో ఎన్నికల ప్రచారం కోసం రంగంలోకి దిగారు.

# భారత్ - బంగ్లా సరిహద్దుల్లో హెరాయిన్ సీజ్..!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఎస్ఎఫ్ సౌత్ బెంగాల్ ఫ్రాంటియర్ భారత్-బంగ్లాదేశ్ అంతర్జాతీయ సరిహద్దుపై నిఘా పెంచింది. ముర్షిదాబాద్ జిల్లా అంతర్జాతీయ సరిహద్దు వద్ద బోర్డర్ పోస్ట్ డీఎంసీ, 149వ కార్ప్స్ 2.2 కిలోల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నది. స్మగ్లర్లు భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు స్మగ్లింగ్ చేయాలని ప్రణాళిక రూపొందించగా.. భగ్నం చేశారు. పట్టుబడి హెరాయిన్ విలువ మార్కెట్‌లో రూ. 2.2కోట్ల విలువ ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆదివారం సాయంత్రం 5.15 గంటల ప్రాంతంలో ప్లాస్టిక్ బ్యాగులతో సరిహద్దుకు సమీపంలో వచ్చిన ముగ్గురు స్మగ్లర్లను సైనికులు గమనించారు. సైనికులను గమనించిన స్మగ్లర్లు ప్యాకెట్లను బంగ్లాదేశ్ సరిహద్దుల్లోకి విసిరేందుకు ప్రయత్నించారు. అవి భారత భూభాగంలోనే పడిపోయాయి. చీకటి కావడంతో మొక్కజొన్న పంట సమీపంలో ఉండడంలో అందులోకి దూరి స్మగ్లర్లు తప్పించుకున్నారు. అనంతరం సంఘటనా స్థలంలో సైన్యం తనిఖీలు నిర్వహించింది. పసుపు రంగు ప్లాస్టిక్ తాడుతో కట్టిన తెలుపు, ఎరుపు రంగు ప్లాస్టిక్ సంచుల్లో తెల్లటి పౌడర్ లభించింది. స్వాధీనం చేసుకున్న పౌడర్‌ను పరీక్షించగా హెరాయిన్‌గా తేలింది. హెరాయిన్‌ను లాల్‌గోలా పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

# వివేకమనే పుస్తకంలో తొలి పాఠం నిజాయితీ మాత్రమే..!

## (30 ఏప్రిల్ 'జాతీయ నిజాయితీ దినం' సందర్భంగా)

వ్యక్తిగత జీవితంలో నిజాయితీకి అత్యధిక ప్రాధాన్యత ఉన్నందున ప్రతి ఏటా ప్రపంచ దేశాలు 30 ఏప్రిల్ రోజున 'జాతీయ నిజాయితీ దినం (నేషనల్ హానెస్టీ డే)' పాటించుట జరుగుతున్నది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో నీతి నిజాయితీకి అధిక ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. 'ది బుక్ ఆఫ్ లైస్' రచయిత యం. హిర్ష్ గోంబర్గ్ చొరవతో 30 ఏప్రిల్ 1789న నిర్వహించిన జార్జ్ వాషింగ్టన్ ప్రథమ వార్షికోత్సవానికి గుర్తుగా 30 ఏప్రిల్‌న 'జాతీయ నిజాయితీ దినం' జరుపుకొనుట ఆనవాయితీ అయ్యింది. నిజాయితీ మాత్రమే మానసిక శారీరక ఆరోగ్య ప్రదాత అని నమ్ముదాం.

### నిజాయితీతో రక్షణ కవచం:

ఒక అబద్ధాన్ని కప్పివుంచడానికి వంద అబద్ధాలు ఆడాల్సి వస్తుంది. దీనితో మానసిక ఒత్తిడి/ఆందోళన పెరిగి నిద్ర దూరం అవుతుంది. నిజాయితీ జీవితాంతం మనల్ని కాపాడే రక్షణ కవచం వలె పని చేస్తుంది. నిజాయితీ అనేది కనబడే వస్తువు కాదు, అంతరంగంలో దాగి ఉంటూ, మన ప్రవర్తన ద్వారా బయట పడుతూ, సర్వదా మన విలువను పెంచుతూ సదా మనల్ని కాపాడుతుంది. ఆకర్షణీయమైన వ్యక్తిత్వ ముఖ్య లక్షణాలుగా నీతి, నిజాయితీ, కరుణ, సానుభూతి– సహానుభూతి, కృతజ్ఞతాభావం, వినయ సంపన్నత, ఓపిక, సహనశీలత, స్వీయ అవగాహన, సమస్యలను అధిగమించే సామర్థ్యం, సానుకూల దృక్పథం, విజ్ఞాన వివేకాలు, నిగ్రహం, నిస్వార్థత, ధైర్య సాహసాలు, నాయకత్వ లక్షణాలు, అంకితభావం, ఆత్మ విశ్వాసం మె?దలగునవి ప్రముఖంగా పేర్కొనబడినవి.

### నిజాయితీ కొరవడిన రాజకీయాలు:

రాజకీయ నాయకుల్లో నీతి నిజాయితీ కొరవడితే అవినీతి, కుంభకోణాలు, అశ్రిత పక్షపాతాలు, అబద్ధాలాడటం, ప్రజాధనాన్ని పంది కొక్కుల వలె మెక్కడం లాంటివి బయట పడతాయి. దాపరికం లేకుండా, సూటిగా, నిష్కపటంగా, సత్య ధర్మాలతో జీవితాలను సుసంపన్నం చేసుకోవాలనే ప్రచారాన్ని ఈ వేదికగా నిర్వహిస్తారు. ఒక పొరపాటును సత్వరమే సవరించు కోవడానికి మనకు అందుబాటులో ఉన్న ఆయుధమే నిజాయితీ అని గుర్తించు కోవాలి. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మానవ సంబంధాలను నిర్ణయంచే గుణం నిజాయితీ మాత్రమే. జాతీయ నిజాయితీ దినం రోజున ప్రతి ఒక్కరు తాము చేసిన పొరపాట్లు, తప్పులను మనస్ఫూర్తిగా అంగీకరించి, సన్మార్గంలో పయనించేందుకు ఉద్యుక్తులు కావాలి. జాతీయ నిజాయితీ దినం రోజున నిజాయితీగా ఉండే ప్రయత్నం చేయడం, ఆ సద్గుణంలోని మాధుర్యాన్ని రుచి చూడడం మంచిది. మనం చేసే మంచి చెడులు, నీతి నిజాయితీ పనులు ముందుగా మనకు మాత్రమే పూర్తిగా తెలుస్తాయి. నిజాయితీని నమ్మిన వారు విలక్షణంగా గుర్తింపు పొందుతారు. నిజాయితీపరులు సమాజంలో అందరినీ సులభంగా ఆకర్షిస్తారు. మానవ సంబంధాలు పటిష్ట పడడానికి నిజాయితీ గుణమే దివ్య వెలుగుగా నిలుస్తుంది. నిజాయితీకి సమాజం పట్టం కట్టాలంటే ముందుగా నేను నిజాయితీపరున్ని కావాలి. అబద్ధాలను ఆశ్రయించిన వారు అనతి కాలంలోనే క్రమంగా కాలగర్భంలో కలిసి పోతారు. నాయకులు నిజాయితీపరులు అయితే సమాజమంతా సన్మార్గంలో నడుస్తుంది. నిజాయితీ కొరవడిన నాయకుల మానసిక స్థితి అధమ స్థాయిలో పడిపోతుంది. అబద్ధాలు/అవినీతి కార్యాలను నమ్మేవారి మనసు చెదలు పట్టి క్రమంగా క్షీణిస్తుంది.

### వివేకమనే పుస్తకంలో తొలి పాఠం నిజాయితీయే:

వివేకమనే పుస్తకంలో ప్రథమ పాఠం 'నిజాయితీ' అవుతుంది. నిజాయితీపరులు ఆరోగ్యంగా, స్వచ్ఛమైన నవ్వులతో వర్ధిల్లుతారు. నిజాయితీని సదా పాటించటానికి ప్రయత్నం చేయాలి. కొన్ని సందర్భాల్లో నిజాయితీ ప్రదర్శన కొందరి మనసులను నొప్పించే ప్రమాదం కూడా ఉంటుంది. నమ్మకం పెరగడానికి నిజాయితీ సహకరిస్తుందని మరువరాదు. బంధుమిత్రుల మనసు గెలవడానికి నిజాయితీ దోహదపడుతుంది. నిజాయితీపరుడు మరో నిజాయితీపరున్ని మాత్రమే ఆకర్షిస్తాడు. స్నేహితులను దగ్గరకు చేర్చే లక్షణం నిజాయితీకి ఉంటుంది. నిజాయితీ ఉన్న చోట నమ్మకం తిష్టవేస్తుంది. నిజాయితీపరుల ప్రవర్తన వల్ల శత్రువులు కూడా పెరగవచ్చు. నిజం పలకడం కన్న మనసులో దాయడానికి ధైర్యం ఎక్కువ కావాలి. అబద్ధాల జీవితానికి స్వస్తి పలకడానికి నిజాయితీ నీడను ఆశ్రయించాలి. చిన్నతనం నుంచే నిజాయితీ గుణాన్ని అలవర్చడం మంచిది. నిజాయితీ నీడన దయ, క్రమశిక్షణ, సత్య పాలన, నైతికత లాంటి గుణాలు తిష్టవేస్తాయి. నిజాయితీ లోపించినపుడు దొంగతనం, లోభితనం, అపనమ్మకం, పిసినారితనం, మోసగించే లక్షణం, అబద్ధాలాడటం లాంటి అమానవీయ అవలక్షణాలు రాజ్యవేలుతాయి.

సరళ జీవన (సింప్లిసిటీ) విధానానికి పునాది నిజాయితీ మాత్రమే. నిజాయితీపరుల సమాజం సస్యశ్యామలంగా, పచ్చని సంసారాల తో, నిత్య చిరునవ్వుల పంటలతో రామరాజ్యంలా వర్ధిల్లుతుంది. మనందరం నిజాయితీని అంతరంగ ఆభరణంగా ధరించి ప్రకాశవంతమైన వ్యక్తిత్వంతో జీవనయానాన్ని సాగిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# పెన్షన్ల పేరుతో శవ రాజకీయాలు.. వైసీపీపై మండిపడ్డ చంద్రబాబు

## -ఎన్నికల కమిషన్ ఆదేశాలు పట్టించుకోవడం లేదు
## -గూడూరులో పాత్రికేయుల సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు

కర్నూలు, ఏప్రిల్ 29: పెన్షన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం శవ రాజకీయాలు చేస్తుందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారం నేపథ్యంలో కర్నూలు జిల్లా గూడూరులో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పెన్షన్ల పంపిణీలో వైసీపీ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని టీడీపీ అధినేత చంద్రబాబు మండిపడ్డారు. పెన్షన్లను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ నేడు ప్రభుత్వం ఆధ్వర్యంలో బ్యాంకులో వేస్తామని అధికారులు ప్రకటించడం సరికాదన్నారు. ఇది ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించడమే అన్నారు.

పింఛన్ల కోసం మండుటెండల్లో పండుటాకులను తిప్పడం సబబా అని ప్రశ్నించారు. పింఛన్ల నగదును బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామంటున్నారనీ.. ఇది ప్రభుత్వ కుట్రలో బాగమేన్నారు. ఈ కుట్రలు, కుతంత్రాల్లో అధికారులు కూడా భాగస్వామ్యం కావడం దురదృష్టకరమన్నారు. సిబ్బంది ఉన్నా ఇంటింటికి పింఛన్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. ఒక్కో వ్యక్తి 45 పింఛన్లు ఇస్తే సరిపోతుందని.. ఎన్నికల అధికారులు చెప్పినా వినే పరిస్థితి లేకుండా పోయిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కుంటి సాకులతో తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈనెపమును తమపై మోపి ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ ప్రభుత్వం ఇలాంటి డ్రామాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. గులకరాయి డ్రామా ప్రజలు ఇప్పటికే తెలుసుకున్నారన్నారు.



ఇప్పుడు తెరపైకి మరో డ్రామా చేస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు.

45డిగ్రీల ఎండలో ఎక్కడో బ్యాంకులో వేస్తే సుధూర ప్రాంతాలకు వెళ్లి పెన్షన్ దారులు ఎక్కడ తెచ్చుకోగలుగుతారని ప్రశ్నించారు. ఈ ఎండలకు వెళ్తే.. వారికి ప్రమాదం పొంచి ఉందన్నారు. రేపు జరగరానిది జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా చనిపోయినా ఇది ప్రభుత్వ హత్యగా భావించాల్సి వస్తుందన్నారు. ఇంటి వద్దే పింఛన్లు ఇవ్వాలని తాము గట్టిగా డిమాండ్ చేశామన్నారు.?కానీ అధికార యంత్రాంగం ప్రభుత్వానికి వత్తాసు పలుకుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ తీరుతో గత నెలలో 33మంది వృద్ధులు ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ హత్యల్లో కొందరు అధికారులు భాగస్వాములయ్యారని మండిపడ్డారు.

ఒక పార్టీ ప్రలోభాల కోసం అధికారులు పనిచేయడం తప్పు అని చంద్రబాబు ఖండించారు. ఇంటి వద్ద పెన్షన్లు పంపిణీ చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పంచాయతీ పరిధిలో ఒక్కో ఉద్యోగి 45 మందికి మాత్రమే పెన్షన్ ఇస్తాడన్నారు. పంచాయతీ ఆఫీసుల్లో ఇచ్చేదే ఇంటి వద్ద ఇస్తారు. ఇందులో తప్పేముంది ? అని చంద్రబాబు ప్రశ్నించారు. పెన్షన్ల నగదును బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామంటున్నారని, అయితే పెన్షన్ తీసుకునే అందరి దగ్గర ఫోన్లు ఉండవు కదా అని చంద్రబాబు ప్రశ్నించారు. బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అయ్యిందో లేదో ఎలా తెలుస్తుందని వైసీపీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామంటూ మరో కొత్త డ్రామాకు తెరదించామని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇలాంటి ప్రభుత్వ యంత్రాంగం ఎంతో ప్రమాదకరమని, ఎన్నికల సంఘం కూడా చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికలు జరగాలని ఆకాంక్షించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అన్ని పార్టీలు ఒక్కటేనని, అన్ని పార్టీలకు సమాన అవకాశాలు ఉంటాయని చంద్రబాబు గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఒక్కడే ప్రభుత్వాన్ని, యంత్రాంగాన్ని వాడుకోవచ్చు. బస్సులు వాడుకోవచ్చు. గ్రౌండ్ వాడుకోవచ్చు అంటే కుదరదన్నారు. సభలకు బెదిరించి ఎక్కువ మందిని తీసుకురావొచ్చని అనుకుంటున్నారు. ఇవన్నీ జరగడానికి వీల్లేదన్నారు. కావున ప్రజలు వీటిని గుర్తించి ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని ఆయన సూచించారు.

## కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ .. బీజేపీలోకి పెద్దపల్లి ఎంపీ

కరీంనగర్, ఏప్రిల్ 29: పార్లమెంటు ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత హస్తం పార్టీకి గుడ్ బై చెప్పి కాషాయతీర్థం పుచ్చుకోనున్నారు. ఈరోజు సాయంత్రం నాలుగు గంటలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకోనున్నారు. అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను మర్యాదపూర్వకంగా కలవనున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీ వెంకటేష్ నేత కొద్ది రోజులకే పార్టీ వీడటం కాంగ్రెస్‌కు మైనస్ కానుంది.

# ఏపీలో పలు రైళ్లు రద్దు

అమరావతి, ఏప్రిల్ 29: ఏపీలో కొరాపుట్–రాయగడ సెక్షన్‌లో భద్రతావరమైన పనులు జరుగుతుండటంతో పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు మరికొన్నింటి దారి మళ్లించి తిప్పుతున్నారు. ఇవాళ , మే 3, 6 తేదీల్లో విశాఖ–కొరాపుట్(18512), ఈ నెల 30, మే 4, 7 తేదీల్లో కొరాపుట్–విశాఖ(18511) బైవీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి.

ఏప్రిల్ 28 నుంచి మే 8వ తేదీ వరకు విశాఖ–కొరాపుట్(08546), ఏప్రిల్ 28 నుంచి మే 9 వరకు కొరాపుట్–విశాఖ(08545) రైళ్లు రాయగడ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో రాయగడ నుంచే బయలుదేరుతాయి. అలాగే ఈ నెల 28వేతదీ ఉదయం 10.15 గంటలకు బయలు దేరాల్సిన ఎస్ఎంవీ బెంగళూరు–జాషిది (22305) ఎక్స్‌ప్రెస్ 29వ తేదీ ఉదయం 6.45 గంటలకు బయలుదేరనుంది.

విజయవాడ– కాజీపేట మార్గంలో ఇంజినీరింగ్ పనులు జరుగుతుండటంతో కొన్ని రైళ్లను బీబీనగర్, నల్గొండ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు మీదగా తిప్పుతున్నారు. విశాఖపట్నం ఎల్‌టీటీ– విశాఖపట్నం (18519)/(18520) రైలు ఈనెల 29 నుంచి మే 9వ తేదీ వరకు, తిరిగి మే 15 నుంచి 21వ తేదీ వరకు బీబీనగర్, నల్గొండ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు మీదుగా నడవనుంది.

షాలిమార్– హైదరాబాద్–షాలిమార్ (18045)/(18046) మే 2, 3, 8, 9, 20, 21 తేదీల్లో గుంటూరు మీదుగా రాకపోకలు సాగిస్తుంది. సికింద్రాబాద్– షాలిమార్– సికింద్రాబాద్ (07225)/07226) ఈనెల 29, మే 6, 20 తేదీల్లో సికింద్రాబాద్ నుంచి గుంటూరు మీదుగా విజయవాడ వెళుతుంది. ప్రయాణికులు ఈ మార్పులను దృష్టిలో ఉంచుకొని ప్రయాణానికి అనువుగా మార్పులు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం




హైదరాబాద్, ఏప్రిల్ 29: భారత నాగరికత పునాదులు మన శాస్త్రీయ కళలు – సంకసాల మల్లేష్, శాతవాహన యూనివర్సిటీ విసి అతి పురాతనమైశాస్త్రీస్త్రీస్త్రీస్త్రీయ కళలు మన వారసత్వ సంపదను పరిపుష్టం చేస్తున్నాయని శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ ఆచార్య సంకసాల మల్లేష్ అన్నారు. 29 ఏప్రిల్ ''అంతర్జాతీయ నృత్య దినోత్సవ" సందర్భంగా లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘ అధ్యక్షులు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో ప్రొఫెసర్ మల్లేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వైవిధ్యభర్త శాస్త్రీయ, జానపద కళలకు పుట్టిల్లుగా సువిశాల భారతం అసంఖ్యాక కళాకారుల, కళాపోషకుల నెలవుగా మారిందని గుర్తు చేశారు. కళాశాలలు, పాఠశాల్లో ఆసక్తి కలిగిన పిల్లలకు, యువతీయువకులకు మన శాస్త్రీయ కళలను నేర్పించడానికి సహాయం చేస్తానని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు, సభాధ్యక్షులు లయన్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ అందరికీ మనవైన కళల పట్ల అవగాహన కలిగి ఉండాలని తల్లితండ్రులు తమ పిల్లలకు కళ నైపుణ్యాలు పెంచుతునే విధంగా శిక్షణలు అందిస్తూ కళలను సజీవ నదీ జలాలుగా ప్రవహించే విధంగా భవిష్యత్తు తరాలకు అందించాలని సూచించారు. పాశ్చాత్య కళలకు ఆకర్షితులవుతున్న నేటి యువత, పిల్లలు మన కళా వైభవాలను మరిచి పోవడం బాధాకరమని తెలియజేశారు. ప్రముఖ శాస్త్రీయ నృత్య కళాకారులు, డ్యాన్స్ మాస్టర్ రతన్ కుమార్ మాట్లడుతూ వారానికి లేదా పక్షానికి ఒక రోజు కరీంనగర్‌లో మన తెలంగాణ పేరిణి శివతాండవం, పేరిణి లాస్య శిక్షణా తరగతులను ఉచితంగా ఏర్పాటు చేస్తామని, ఆసక్తిగల యువత నాట్యాన్ని నేర్చుకోవడానికి ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా ప్రముఖ నృత్య కళాకారులు ఇంజనీరు రతన్ కుమార్, నంది పురస్కార గ్రహీత, గిన్నీస్ రికార్డు హోల్డర్ శాస్త్రీయ నర్తకి కుమారి స్నేహితలను ఆచార్య మల్లేష్, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, నగర కళాభిమానులు పాల్గొని సన్మాన గ్రహీతలకు నృత్య దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు.

# విదేశీ విద్య బ్రోచర్‌ను ఆవిష్కరించిన నామ నాగేశ్వరరావు



ఖమ్మం, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సిట్టింగ్ ఎంపీ,బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు చేతుల మీదుగా విదేశీ విద్యకు సంబంధించిన 'మై డ్రీమ్ అబ్రాడ్' స్టడీ సెంటర్ బ్రోచర్ ను ఆవిష్కరించడం జరిగింది. పేద వర్గాలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాలని, ఖమ్మం లో ఇందుకు సంబంధించి స్టడీ సెంటర్ ప్రారంభించిన నిర్వాహకులను ఈ సందర్భంగా నామ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టడీ సెంటర్ యజమాని పెద్దప్రోలు మధుకుమార్, నామ భవ్యతేజ, సాయిరామ్, రావులపల్లి అవినాష్, సరిపూడి గోపీ సందేశ్ తదితరులున్నారు.




# మల్కాపురం సీఐ సన్యాసి నాయుడు సస్పెండ్

విశాఖ,ఏప్రిల్ 29: స్వతంత్ర అభ్యర్థి విషయంలో సీఐ చేసిన అనుచిత ప్రవర్తన, తీవ్ర ఆరోపణల నేపథ్యంలో అతన్ని సస్పెండ్ చేశారు. మల్కాపురం సీఐ ఎస్.సన్యాసి నాయుడును ఈ ఆరోపణల నేపథ్యం లోనే ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేశారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన కోయలాడ వేంకటేశ్వర జగదీష్ అనే రౌడీ షీటర్ పట్ల సీఐ అనుచితంగా ప్రవర్తించినట్టు అభియోగం వచ్చింది. నామినేషన్ ను వెనక్కి తీసుకోవాలని చిత్ర హింసలు పెట్టినట్టు ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు అందడంతో విచారణ అనంతరం సీఐను సస్పెండ్ చేయాలని స్థానిక అధికారులను ఎన్నికల కమిషన్ పరిశీలకులు ఆదేశించారు.

ఎంవీపీ, పద్మనాభం సీఐగా ఉన్న సమయంలో సదరు సీఐపై అనేక ఆరోపణలున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్మీ ఉద్యోగిపై హత్యాయత్నం కేసు కాస్త కొట్లాట కేసుగా మార్చడంపై పోలీసుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతాయి. అలాగే దళిత యువకుడికి థర్డ్ డిగ్రీ పేరుతో కాళ్ళు విరిచేసిన ఘటన విశాఖలో సంచలన రేపింది. చివరకు విశాఖ వెస్ట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన కోయలాడ వేంకటేశ్వర జగదీష్ అనే రౌడీ షీటర్ పట్ల సీఐ అనుచితంగా ప్రవర్తించినట్టు అభియోగం రావడంతో సీఐ పై వేటు వేయక తప్పలేదు. ప్రస్తుతం జరిగిన ఘటనపై విచారణకి ఆదేశించినట్లు తెలుస్తోంది.

# నెత్తురోడిన రహదారులు.. ఆరుగురు మృతి

అమరావతి, ఏప్రిల్ 29: ఏపీలో రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం జిల్లాలో మద్యం మత్తు నలుగురు యువకుల జీవితాలను చిదిమేసింది.

వివరాల్లోకి వెళ్తే.. మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన కొమ్మాబత్తుల జతిన్ పుట్టినరోజు సందర్భంగా 8 మంది యువకులు ఆదివారం రాత్రి యానాంలో సెలబ్రేషన్స్ చేసుకున్నారు. వేడుకల తర్వాత.. స్వగ్రామానికి ఆటోలో బయల్దేరారు. గత అర్ధరాత్రి 12.30 గంటల తర్వాత అమలాపురం మండలం భట్నవిల్లి గ్రామంలో శ్రీ వనువులమ్మ టెంపుల్ ఎదురుగా.. ఎన్‌హెచ్216 రోడ్డుపై అమలాపురం నుంచి ముమ్మిడివరం వైపుగా వెళ్తున్న చేపల లారీ ని ఢీ కొట్టింది.

ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందిలో నలుగురు మృతి చెందారు. ప్రమాద ప్రాంతానికి వెళ్లిన పోలీసులు గాయపడిన నలుగురు క్షతగాత్రులను కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను మార్చురీకి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలో జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. సోమవరప్పాడు వద్ద రెండు బైకులు ఢీ కొనగా ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. మరో ముగ్గురు గాయపడగా.. వారిని ఆస్పత్రికి తరలించారు.

# కడప జిల్లాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఆత్మహత్య

అమరావతి, ఏప్రిల్ 29: ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడిన విసాద ఘటన వైఎస్సార్ కడప జిల్లాలో చోటుచేసుకుంది. తల్లి, కొడుకు, కూతురు చెట్టుకు ఉరి వేసుకుని సూసైడ్ చేసుకున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.తల్లి, కొడుకు, కూతురు మృతికి కుటుంబ కలహాలే కారణమని స్థానికులు పోలీసులకు వివరించారు. ఆత్మహత్యలకు కుటుంబ కలహాలేనా మరేదైనా కారణం ఉందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకేసారి ఆత్మహత్యకు పాల్పడటంతో వల్లూర్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి..

# సరిహద్దుల్లో 'చెక్' పోస్టులు ..104 కోట్ల విలువైన నగదు, బంగారం పట్టివేత

**-తనిఖీల్లో 104 కోట్ల నగదు, బంగారం పట్టివేత**
**-ఎన్నికల నేపథ్యంతో 89 చెక్ పోస్ట్ లు ఏర్పాటు**
**-42 రోజుల సోదాలలో భారీగా మద్యం, నగదు పట్టివేత**
**-29 కోట్ల ఆభరణాలు స్వాధీనం**
**-రూ.5 కోట్ల విలువైన మద్యం సీజ్**

హైదరాబాద్, ఏప్రిల్ 29: హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తనిఖీల్లో భారీగా నగదు, మద్యం, డ్రగ్స్ పట్టుబడుతున్నాయి. మార్చి 16 నుంచి ఏప్రిల్ 28 వరకు రూ.104.18 కోట్లను తనిఖీ



బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 477 ఎఫ్ఎస్టీ, 464 ఎస్ఎస్టీ బృందాలు 89 సరిహద్దు చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం, డ్రగ్స్, ఉచితాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో రూ.63.18 కోట్ల నగదు ఇప్పటికే దొరకడం కలకలం సృష్టిస్తున్నది. ఇక రూ.5.38 కోట్ల విలువైన మద్యం, రూ.7.12 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.21.34 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.6.91 కోట్ల విలువైన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 7,174 లైసెన్స్ ఆయుధాలను పోలీసులకు డిపాజిట్ చేశారు. అనధికారికంగా వెంటపెట్టుకొన్న 14 ఆయుధాలను సీజ్ చేశారు. జిలిటెన్స్టిక్స్, డిటోనేటర్లు, కార్టన్ బాక్స్ వంటి పలు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

# 600 కోట్ల విలువైన 86 కిలోల మాదకద్రవ్యాలను ఐసిజి స్వాధీనం చేసుకుంది మరియు పాకిస్తాన్ నౌకలోని 14 మంది సిబ్బందిని పట్టుకుంది




న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఎఅఉ) యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (యీ) మరియు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఔఅః) సహకారంతో 600 కోట్ల రూపాయల విలువైన 86 కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది మరియు పాకిస్తాన్ నౌక నుండి 14 మంది సిబ్బందిని పక్కా ప్రణాళికతో పట్టుకుంది. ఏప్రిల్ 28, 2024న సముద్రంలో నార్కోటిక్స్ ఆపరేషన్.

ఎటిఎస్ మరియు ఎన్‌సిబి అధికారులతో కూడిన ఐసిజి షిప్ రాజ్‌రతన్, గుర్తించకుండా తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ అనుమానిత పడవను సానుకూలంగా గుర్తించింది. రాజ్‌రతన్ యొక్క వేగవంతమైన ప్రతిస్పందన, ఏకకాల మిషన్‌లలో నౌకలు మరియు విమానాల సముదాయం ద్వారా మద్దతు ఇవ్వబడింది, మాదకద్రవ్యాలతో నిండిన నౌకను తప్పించుకోవడానికి ఎటువంటి స్థలాన్ని వదిలిపెట్టలేదు. ఓడ యొక్క ప్రత్యేక బృందం అనుమానిత పడవలో బయలుదేరింది మరియు క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాత, గణనీయమైన మొత్తంలో మాదకద్రవ్యాల ఉనికిని నిర్ధారించారు. తదుపరి విచారణ మరియు చట్టపరమైన చర్యల కోసం సిబ్బంది మరియు నౌకను ప్రస్తుతం పోర్‌బందర్‌కు తీసుకువెళుతున్నారు.

గత మూడు సంవత్సరాలలో ICG మరియు ATS ఉమ్మడిగా, ఇది 11 విజయవంతమైన చట్ట అమలు కార్యకలాపాలకు దారితీసింది, ఇది జాతీయ లక్ష్యాల కోసం సినర్జీని పునరుద్ఘాటిస్తుంది.

# వైద్యులు రాక హాస్పటల్‌లో రోగుల పడిగాపులు

వరంగల్, ఏప్రిల్ 29: ప్రభుత్వ వైద్యం ప్రజల చెంతకు చేరడం లేదు వైద్యుల నిర్లక్ష్యంతో రోగులు అష్ట కష్టాలు పడుతున్నారు ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు లేకపోవడంతో రోగులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముగ్గురు వైద్యులు ఉన్నప్పటికీ ఒక్కరు కూడా అందుబాటులో లేకపోవడంతో సోమవారం వైద్యశాలకు వచ్చిన రోగులకు స్టాఫ్ నర్స్ హెల్త్ సూపర్వైజర్ మాత్రమే రోగులకు నచ్చ చెబుతూ డాక్టర్ వస్తున్నారు వేచి ఉండండి సమాధానం ఇస్తున్నారు..

దీనితో ప్రభుత్వ వైద్యశాలలో పని చేస్తున్న వైద్యులు ఇంతటి నిర్లక్ష్యం వహించడం సరైనది కాదని పలువురు మండిపడుతున్నారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు నిరాశతో వెను తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రభుత్వ వైద్య ప్రజలకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# అచ్చంపేటలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

అమరావతి, ఏప్రిల్ 29: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని గోకుల్‌నగర్ కాలనీలో సోమవారం ఉదయం 4 గంటల నుండి కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా అడిషనల్ ఎస్పీ సిహెచ్ రామేశ్వర్ అన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణ, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉపయోగించుకునేందుకు గాను ఈ సెర్చ్ ఆఫరేషన్ ముఖ్య ఉద్దేశ్యము అని తెలిపారు. కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి అనుమానస్పద వ్యక్తులు, నిషేధిత ఆయుధాలు, వస్తువులు, అక్రమంగా నిల్వవుంచిన మద్యం, నిషేదిక నాటు సారా గురించి ఆరా తీయడం జరిగిందని తెలిపారు. సెర్చ్ ఆఫరేషంలో సరైన ధృవపత్రాలు లేని 70 ద్విచక్ర వాహనాలు, 1 కారు, 1 ఆటోలను అదుపులోకి తీసుకోవడం జరిగిందని అన్నారు.

అదుపులోకి తీసుకున్న వాహనదారులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, తమ వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ ఓనర్‌షిప్ డాక్యుమెంట్స్ లేదా ఆన్‌లైన్‌లోని ఎమ్ వ్యాలెట్‌లో వాహనానికి సంబందించిన డాక్యుమెంట్స్‌ను చూపించి అలాగే ఇతరుల నుండి వాహనాలను కొనుగోలు చేసినట్లయితే వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపించి తమ వాహనాలను తీసుకుపోవచ్చని తెలిపారు.

# చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఫ్రాన్స్‌లో తన అధికారిక పర్యటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, జనరల్ అనిల్ చౌహాన్ ఫ్రాన్స్‌లో సమగ్ర పర్యటనను ముగించారు, ఇది భారతదేశం మరియు ఫ్రాన్స్‌ల మధ్య కొనసాగుతున్న దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునరుద్ఘాటించింది మరియు రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని మరింత బలోపేతం చేసింది.

ఫ్రెంచ్ సాయుధ దళాల మంత్రి యొక్క సివిల్ ఛ మిలిటరీ క్యాబినెట్ డైరెక్టర్ పాట్రిక్ పైలౌక్స్ మరియు అత్యున్నత స్థాయిలో సాయుధ దళాల మంత్రి యొక్క మిలిటరీ క్యాబినెట్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ విన్సెంట్ గిరాడ్ మరియు అతని కౌంటర్‌తో కూడా CDS యొక్క పరస్పర చర్యలు, జనరల్ థియరీ బుర్ఖార్డ్ ((CEMA) ) ఉమ్మడి ఆసక్తులు మరియు పరస్పర భద్రతా సమస్యలపై అభిప్రాయాల మార్పిడిని ప్రారంభించారు.

హై-ఎండ్ డ్యూయల్-యూజ్ టెక్నాలజీల మార్పిడిని పెంపొందించడం కోసం ఫ్రాన్స్ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఆర్మమెంట్‌లో చర్చలు, డసాల్ట్, సఫ్రాన్ మరియు నేవల్ గ్రూప్‌లు మరియు థేల్స్ అలెనియా స్పేస్‌తో సహా ఫ్రెంచ్ డిఫెన్స్ పరిశ్రమ యొక్క అగ్ర నాయకత్వంతో భవిష్యత్ సామర్థ్యాన్ని పెంపొందించే దిశగా పరస్పర చర్చలు జరిగాయి. భారత సాయుధ బలగాలు స్వదేశీకరణకు ఊతాన్ని అందిస్తాయి.

ఫ్రెంచ్ ల్యాండ్ ఫోర్సెస్ కమాండ్, ఫ్రెంచ్ స్పేస్ కమాండ్, మరియు స్కూల్ ఆఫ్ మిలిటరీ స్టడీస్ లలోని ఎక్స్ఛేంజీలు, భద్రతా సవాళ్లపై భారతదేశ దృక్కోణాన్ని అందిస్తూనే, రక్షణ సహకారాన్ని పెంపొందించే అవకాశాలను అందించాయి. అంతరిక్షం, ఆధునికీకరణ కార్యక్రమాలు మరియు రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక శిక్షణను పెంపొందించడం.

ఈ ప్రాంతంలో శాంతి మరియు ప్రశాంతతను పెంపొందించే దిశగా మొదటి ప్రపంచ యుద్ధంలో పశ్చిమ ఫ్రంట్‌లో పోరాడిన ఇండియన్ ఎక్స్‌పెడిషనరీ ఫోర్స్‌లోని సైనికుల అసాధారణ ధైర్యసాహసాలకు, CDS కూడా న్యూవ్-చాపెల్లె మరియు విల్లర్స్-గిస్లైన్‌ల యుద్ధ స్మారక చిహ్నం వద్ద నివాళులర్పించింది. ఈ స్మారక చిహ్నాలు సుదీర్ఘకాలంగా ఉన్న ఇండో-ఫ్రెంచ్ సంబంధాలకు సాక్ష్యంగా నిలుస్తాయి.

భారతదేశం-ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం కాలక్రమేణా గణనీయమైన ఊపందుకుంది మరియు ఇప్పుడు సహకారం యొక్క విభిన్న రంగాలలో విస్తరించి ఉన్న మరింత సన్నిహిత మరియు బహుముఖ సంబంధంగా పరిణామం చెందింది.

# గనుల మంత్రిత్వ శాఖ రేపటి నుండి రెండు రోజుల క్రిటికల్ మినరల్స్ సమ్మిట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: గనుల మంత్రిత్వ శాఖ, శక్తి సస్టైనబుల్ ఎనర్జీ ఫౌండేషన్ (శక్తి), కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్, మరియు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ సహకారంతో "క్రిటికల్ మినరల్స్ సమ్మిట్: పెంపొందించడం మరియు ప్రాసెసింగ్ సామర్థ్యాలను నిర్వహిస్తుంది. " ఏప్రిల్ 29 నుండి ఏప్రిల్ 30, 2024 వరకు, న్యూ ఢిల్లీలోని లోధీ ఎస్టేట్‌లోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో.

క్రిటికల్ మినరల్స్ సమ్మిట్ అనేది కీలకమైన మినరల్ బెనిఫిసియేషన్ మరియు ప్రాసెసింగ్ రంగంలో సహకారాన్ని పెంపొందించడానికి, జ్ఞానాన్ని పంచుకోవడానికి మరియు ఆవిష్కరణలను నడపడానికి రూపొందించబడిన ఒక కీలకమైన కార్యక్రమం. భారతదేశం యొక్క వేగవంతమైన ఆర్థిక వృద్ధి మరియు ప్రతిష్ఠాత్మకమైన క్లీన్ ఎనర్జీ లక్ష్యాల నేపథ్యంలో ఈ శిఖరాగ్ర సమావేశం ఏర్పాటు చేయబడింది, ఇది పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు మరియు ఎలక్ట్రిక్ వాహనాలతో సహా కీలక సాంకేతికతలకు అవసరమైన క్రిటికల్ రా మెటీరియల్స్ (CRM) యొక్క దేశీయ సరఫరాను పొందవలసిన తక్షణ అవసరాన్ని నొక్కి చెబుతుంది.

ఈ శిఖరాగ్ర సమావేశంలో పరిశ్రమల నాయకులు, స్టార్టప్‌లు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు మరియు విధాన నిపుణులతో సహా విభిన్నమైన భారతీయ మరియు అంతర్జాతీయ వాటాదారులను ఒకచోట చేర్చనున్నారు. ఖనిజ వేలం పురోగతి, CRM పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి విధాన ప్రోత్సాహకాలు మరియు వాణిజ్యంగా లాభదాయకమైన మరియు పర్యావరణపరంగా స్థిరమైన పరిష్కారాల పురోగతి వంటి క్లిష్టమైన సమస్యలపై దృష్టి కేంద్రీకరించిన క్రియాశీల సంభాషణలు మరియు ఇంటరాక్టివ్ వర్క్‌షాప్‌లలో పాల్గొనేవారు పాల్గొంటారు. సమ్మిట్ యొక్క ముఖ్య లక్షణాలు ఎనిమిది కీలక ఖనిజాలపై సాంకేతిక సెషన్లను కలిగి ఉన్నాయి: గ్లాకోనైట్ (పొటాష్), లిథియం - రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ (లాటరైట్), క్రోమియం, ప్లాటినం గ్రూప్, గ్రాఫైట్, గ్రాఫైట్‌తో సంబంధం ఉన్న టంగ్‌స్టన్, రేర్ ఎర్త్ (RE), మరియు గ్రాఫైట్‌తో అనుబంధించబడిన వనాడియం. ఈ సెషన్‌లు బిజినెస్-టు-బిజినెస్ సహకారం మరియు జ్ఞానాన్ని పంచుకోవడానికి విలువైన అవకాశాలను అందిస్తాయి.

క్రిటికల్ మినరల్స్ సమ్మిట్ యొక్క లక్ష్యం ఏమిటంటే, భారతదేశ ఆర్థిక వృద్ధి మరియు స్థిరత్వ లక్ష్యాలకు మద్దతునిస్తూ, CRMల దేశీయ ఉత్పత్తిని వేగవంతం చేయడానికి అవసరమైన జ్ఞానం, కనెక్షన్లు మరియు సాధనాలతో ప్రభుత్వం మరియు పరిశ్రమ వాటాదారులను సన్నద్ధం చేయడం.

# జగన్ అవినీతి కోటల్ని బద్దలు కొడదాం-పవన్ కళ్యాణ్

**-మన ఆస్తిని మనం రుజువు చేసుకోవాలా?**
**-పట్టాదార్ పాస్ పుస్తకంపై రాజముద్ర వేయాలి**
**-జగన్ ఫోటో వేయవచ్చా**
**-డీఫారం పట్టాలనూ మింగేస్తారు**
**-యువతకు ఉపాధి కల్పిస్తాం**
**-రైతుకు సాగునీరు ఇస్తాం**
**-వెల్దుర్తి సెంటర్ లో పవన్ కళ్యాణ్**

అమరావతి, ఏప్రిల్ 29: "ఆంధ్రప్రదేశ్? రాష్ట్రం పురోగతిలో పయనించాలంటే రైతులు బాగుండాలి. యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. ఇందుకు ఎన్డీయే కూటమి పని చేస్తుందని"జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రోడ్ షోలో పాల్గొన్నారు. గ్రామగ్రామాన పవన్ కళ్యాణ్ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు పట్టారు. కుర్రకారు కేరింతలు కొట్టారు. ప్రతి గ్రామంలోనూ పవన్ కళ్యాణ్ రోడ్ షో కోసం ప్రజలు ఎదురు చూశారు. పి.దొంతమూరు వెల్దుర్తి సెంటర్ లో పవన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

### మన ఆస్తిపై జగన్ ఫోటో పెడతారా..

పట్టాదారుల పుస్తకాలపై జగన్ ఫోటోను ముద్రించడంపై జనసేనాని ఫైర్ అయ్యారు. మన భూముల పట్టాదారు పాసుపుస్తకాలపై రాజముద్ర ఉండాలి గాని జగన్ ఫోటో ఏమిటి అని ప్రశ్నించారు. "ఇక దస్తావేజులు ఉండవట అన్నీ సర్వర్ లో ఉంటాయట. మళ్లీ వైసీపీ అధికారంలోకి వస్తే మన అందరి ఆస్తులుపోతాయి" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది నా ఆస్తి అని మనం రుజువు చేసుకోవాలా" ఇదెక్కడి న్యాయం అంటూ విరుచుకుపడ్డారు. కష్టపడి సంపాదించుకున్న ఆస్తులకే దిక్కు లేనప్పుడు అసైన్డ్ డి ఫారం పట్టా భూములను వైసీపీ నాయకులు మిగులుస్తారా అని ప్రశ్నించారు.

### వైసీపీ ప్రభుత్వానిన చెత్తబుట్టలో వేద్దాం..

ప్రభుత్వ ఆస్తులు, వనరులు అన్నింటిని సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి , కరుణాకర్ రెడ్డి, ద్వారంపూడి లాంటి వైసీపీ నాయకులకు జగన్ పంచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పురుషోత్తం పట్నం ఎత్తిపోతల పథకానికి నిధులు లేవంటూ పంటలు ఎండబెడుతున్నారన్నారు. కనీసం డీజిలు ఖర్చులు కూడా భరించటం లేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురుషోత్తమ పట్నం రైతుల కోసం నిధులు మంజూరు చేయిస్తా మన్నారు. పోలవరం ప్రాజెక్టును జగన్



సర్వనాశనం చేశారని మండిపడ్డారు. వైసీపీ అవినీతి కోటలు బద్దలు కొడుతున్నామని.. అరటి తొక్క లాంటి వైసీపీ ప్రభుత్వాన్ని చెత్త బుట్టలో పడేద్దాం అంటూ పిలుపునిచ్చారు. ఏలేరు సుద్ధగడ్డ ఆధునీకరణ బాధ్యత తీసుకుంటాననిహామీ ఇచ్చారు. ఓట్లు చీలకూడదు. రాష్ట్రం బాగుండాలి అనే తాను కూటమిలో చేరానని చెప్పారు. ఎస్ఎస్ఎస్ వర్మ జనసేన కోసం త్యాగం చేశారని, సాధారణంగా పార్టీల్లో అంతర్గత గొడవలు సహజమని, కానీ వర్మ లాంటి వ్యక్తి మనకు ఎంతో అవసరమన్నారు. "మాకు అధికారం లేదు కానీ నాకు సైన్యం ఉంది. అన్యాయం జరిగితే మా సైన్యం ఊరుకోదు. ఈ దుష్ట పరిపాలనకు అంతం పలకాలి. రాష్ట్రం బాగుండాలంటే టీడీపీ,జనసేన కలిసి పని చేయాలి" అని పవన్ కళ్యాణ్ వివరించారు.

# దేశాభివృద్ధి కోసం ఆలోచించే ఏకైక పార్టీ బిజెపి



**-బిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అవినీతి రాజ్యమేలింది**
**-మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం సరికాదు**
**-బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా**

కొత్తగూడెం భద్రాద్రి ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: దేశాభివృద్ధి కోసం ఆలోచించే ఏకైక పార్టీ బిజెపి అని బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తెలిపారు. మోడీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం మూడో సారి ఏర్పాటు చేస్తామని, విపరీతమైన ఎండలో కూడా బిజెపి సభకు తరలవచ్చిన ప్రజలను చూసి నడ్డా ఆశ్చర్యపోయారు. కొత్తగూడెంలో జరిగిన బిజెపి బహిరంగ సభలో నడ్డా మాట్లాడారు. కేంద్రం పదేళ్లుగా తెలంగాణకు అన్ని రకాలుగా సాయం చేశామని, తెలంగాణకు ఇచ్చే పన్నుల వాటా మూడు రెట్లు పెరిగిందని తెలియజేశారు. ఎంపి అభ్యర్థులు సీతారాం నాయక్, వినోద్ రావు గెలుపు ఖాయమన్నారు. అయోధ్యలో వందల ఏళ్ల రామమందిరం కలను మోడీ సాకారం చేశారని ప్రశంసించారు. మోడీ ప్రభుత్వం ఎంతో ధైర్యంతో 370 ఆర్టికల్‌ను రద్దు చేసిందని నడ్డా కొనియాడారు.

ధారంగా రిజర్వేషన్లు కల్పించడం సరికాదని సూచించారు. ఆయా పార్టీల వారసుల కోసమే ఇండియా కూటమి ఏర్పాటు చేశారని, ఇండియా కూటమి నేతలు అనేక కుంభకోణాలకు పాల్పడ్డారని, అనేక మంది కూటమి నేతలు అవినీతి చేసి జైళ్లకు వెళ్లారని దుయ్యబట్టారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కూతురు ఢిల్లీ మద్యం కేసు కుంభకోణంలో జైల్లో ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంఘవ్యతిరేక శుక్తులన్నీ విజృంభిస్తాయని, కాంగ్రెస్ హయాంలో ఎక్కడ చూసినా కుంభకోణాలు, అవినీతి కనపడుతోందని నడ్డా విమర్శలు గుప్పించారు.

"గిరిజనుల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థను మోడీ 11 వ స్థానం నుంచి ఐదో స్థానానికి తీసుకవచ్చారు, రెండేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతోంది. మా పాలనలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. మేడిన్ ఇండియా ఔషధాలు ప్రపంచ దేశాలకు వెళ్తున్నాయి. ఒకప్పుడు ఫోన్లన్నీ మేడిన్ చైనా, కొరియా, జపాన్ అని ఉండేవి. మేకిన్ ఇండియా పేరుతో భారత్‌లోనే ఫోన్లు తయారవుతున్నాయి. 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ ఇస్తున్నాం, మరో ఐదేళ్లు కొనసాగిస్తాం. నాలుగు కోట్ల మందికి ఇళ్లు కటించి ఇచ్చాం, మరో మూడు కోట్ల ఇళ్లు కటిస్తాం. పిఎం మోడీ ఎప్పుడూ పేదలు రైతుల గురించే ఆలోచన చేస్తారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా 70 ఏళ్లు పైబడిన వారికీ చికిత్స అందించాం, భవిష్యత్తులో పైపులైను ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేస్తాం" అని జెపి నడ్డా తెలిపారు.

# కేంద్ర మంత్రి సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఎంపీ వెంకటేష్



కరీంనగర్, ఏప్రిల్ 29: లోక్ సభ ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ బీజేపీలో చేరారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత హస్తం పార్టీకి గుడ్ బై చెప్పి సోమవారం కాషాయతీర్థం పుచ్చుకునున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఎంపీ వెంకటేష్ నేతకు కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మాట్లాడుతూ? వెంకటేష్ నేతకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. ఎంపీ వెంకటేష్ నేత మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ, దేశరక్షణ, హిందూ ధర్మ రక్షణ కోసం మోడీ విశేష కృషి చేస్తున్నందున బీజేపీలో చేరానన్నారు. మూడోసారి భారతదేశానికి మోడీ ప్రధాని కావడం ఖాయమని, 400 పైగా స్థానాలను ఎన్డీఏ కూటమి కైవసం చేసుకుంటుందన్నారు.

# పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎక్కడా గెలిచే పరిస్థితి లేదు

**- పట్టభద్రుల కాంగ్రెస్ ఎంఎల్ సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న**

వరంగల్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఎక్కడా గెలిచే పరిస్థితి లేదని ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పట్టభద్రుల కాంగ్రెస్ ఎంఎల్ సి అభ్యర్థి తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) అన్నారు. వరంగల్ లో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్య చేశారు. బిజెపి మెప్పు పొందేందుకు అన్ని స్థానాల్లో కెసిఆర్ డమ్మీ అభ్యర్థులను నియమించారన్నారు. ఇండియా కూటమి కేంద్రంలో అధికారంలోకి వస్తే 50 శాతం బిసిలకు రిజర్వేషన్ ఇస్తుందని తెలిపారు. బిజెపికి ఓటేస్తే 'వన్ నేషన్ కాదుజీరో ఎలక్షన్ అవుతుంది' అన్నారు.




# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది

**–సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్ లకు ఓటర్ అవగాహన కార్యక్రమం.**
**–40% వికలాంగత్వం ఉన్నవారికి ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగం.**
**–పోలింగ్ స్టేషన్లో అన్ని రకాల మౌలిక వసతుల ఏర్పాటు.**
**–పిడబ్ల్యుడి ఓటర్ల కోసం సాక్ష్యం అనే యాప్ ని ప్రవేశపెట్టిన ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.**

సంగారెడ్డి, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి):ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. సోమవారం సంగారెడ్డి



కలెక్టరేట్ సమావేశ మందిరం లో జిల్లాలోని సీనియర్ సిటిజన్ లు, ట్రాన్స్ జెండర్లు వికలాంగులకు ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాటాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమన్నారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుసుకొని ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈవీఎంలు వివి ప్లాట్ ల ద్వారా ఓటు వేసే విధానంపై ఈ సందర్భంగా వృద్ధులు ట్రాన్స్ జెండర్లు వికలాంగులకు అవగాహన కల్పించారు. 40% వికలాంగత్వం నుండి నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులకు, నడవలేని స్థితిలో ఉన్న వయోవృద్ధులకు ఇంటి వద్దని ఓటు హక్కును వినియోగించుకుని సౌకర్యం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల కోసం జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లో పాటు మెదక్ జిల్లాలోని మెదక్ పార్లమెంటు పరిధిలోకి వచ్చి సంగారెడ్డి పటాన్చెరు నియోజకవర్గం అన్ని పోలింగ్ స్టేషన్లో వీల్ చైర్ ఏర్పాటు రాంపుల ఏర్పాటు తాగునీరు ఇతర మౌలిక వసతుల ఏర్పాటు కల్పించినట్లు తెలిపారు. 80 సంవత్సరాలు పైబడిన నడవలేని స్థితిలో ఉన్న సీనియర్ సిటిజన్లకు ఇంటి వద్దని ఓటు హక్కు వినియోగించుకునేలా ఆయా వారి ఆయా పోలింగ్ స్టేషన్లో బిఎల్వోలు నిర్ణయిత ప్రొఫార్మాలు ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించారన్నారు. పిడబ్ల్యుడి ఓటర్ల కోసం ఎన్నికల సంఘం సాక్ష్యం అనే ఆప్ ను ప్రవేశపెట్టిందన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో ఈ యాప్ ను డౌన్లోడ్ చేసుకొని ఓటు హక్కు వినియోగం కోసం దరఖాస్తు చేసుకోవాలి అన్నారు.

ఈనెల 25 నుండి జిల్లాలోని ఓటర్లకు ఓటర్ స్లిప్పులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు . కంటి చూపు లేని వారు బ్రెయిలీ లిపి ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్ జెండర్లు వికలాంగులు తో అధికారులు ఓటు హక్కు ను తప్పకుండా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు ట్రాన్స్ జెండర్ ల కు ఐడి కార్డులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సాధారణ పరిశీలకులు గోపాల్ జి తివారి మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో పోలింగ్ శాతం పెంచాలని ,ప్రజాస్వామ్యనీ ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు.

అనంతరం సీనియర్ సిటిజన్స్, ట్రాన్స్ జెండర్లు,వికలాంగులు, అధికారులు ఓటర్ల తో ఓటర్ ప్రతిజ్ఞ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డి డబ్ల్యు, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అఖిలేష్ రెడ్డి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సీనియర్ సిటిజన్లో ట్రాన్స్జెండర్లు వికలాంగులు పాల్గొన్నారు.

# పరిపాలనలో రేవంత్ రెడ్డి కంటే కేసీఆరే నయం

**– కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు**

హైదరాబాద్ ఏప్రిల్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: పరిపాలనలో రేవంత్ రెడ్డి కంటే కేసీఆరే నయం అనిపిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోత్కుపల్లి నర్సింహులు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి మాదిగ జాతిని ఎదగకుండా బొంద పెట్టే ప్రయత్నం చేస్తున్నాడని ఆయన మండిపడ్డారు. హైదరాబాద్లో ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు.రేవంత్ కంటే కేసీఆరే నయం అనిపిస్తుంది. సాగునీరు లేక పొలాలు ఎండిపోతున్నాయి. కరెంటు లేదు. దళితబంధు లేదు. రైతు బంధు లేదు. తులం బంగారం లేదు. రూ. 2500 మహాలక్ష్మి పథకం లేదు. ఈ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నడుస్తుంది. రేవంత్ రెడ్డిని కలుస్తున్న వాళ్ళు మొత్తం రియల్ ఎస్టేట్ వ్యాపారులే. వారు తప్ప, పేదలు ఎవరు రావట్లేదు. పేరుకి ప్రజాపాలన అని పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ప్రగతి భవన్లో ప్రజాపాలన అని పెట్టి 3 రోజులకే మూసేశారు. ఒక్కసారి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి మళ్ళీ ఎందుకు రాలేదు? అంత పని ఏం ఉంది? అని మోత్కుపల్లి నర్సింహులు నిలదీశారు.సీఎం రేవంత్ రెడ్డి ఏ ఒక్క స్కీమ్ మీద కూడా దృష్టి పెట్టడం లేదు. ఏమైనా అంటే పైసల్ లేవు.. పైసల్ లేవు అంటావు.. పైసల్ ఉంటే నువ్వు ఎందుకు, పైసల్ లేకున్నా పనులు చేయగలిగిన వాడే సమర్థుడు. ఇదేమి వ్యాపార సంస్థ కాదు.. ప్రజాసంస్థ అని కాంగ్రెస్ నేత మోత్కుపల్లి నరసింహులు పేర్కొన్నారు.

# రఘురాంరెడ్డి గెలుపుకోసం ప్రతిఒక్కరు కృషిచేయాలి:మల్లు భట్టి



ఖమ్మం, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఖమ్మం లోక్ సభ నియోజకవర్గం పై కాంగ్రెస్ జెండా ఎగరవేసేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఖమ్మం లోక్ సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలతో ఖమ్మం ప్రజాభవన్ లో సమావేశం నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రామసహాయం రఘురాం రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, కూనంనేని సాంబ శివరావు, జారే ఆదినారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జావేద్ పాల్గొన్నారు.

# బావుసింగ్ నాయక్ తండాలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం బావుసింగ్ నాయక్ తండాలో కరీంనగర్ బిఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ సతీమణి డాక్టర్ మాధవి పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో సమావేశమై, ఎంపీగా వినోద్ కుమార్ ను గెలిపించాలని కోరారు. ఆమె వెంట రాజన్న సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తోట ఆగన్న, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమా, మండల ప్రజా ప్రతినిధులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# రైతుల విషయంలో కాంగ్రెస్ మేనిఫెస్టోకు భిన్నంగా వ్యవహరిస్తుంది

**–500 బోనస్.. ఎకరాకు 15 వేల రైతు భరోసా.. రెండు లక్షల రుణమాఫీ ల కు కాంగ్రెస్ సర్కార్ మొండిచేయి...**
**–జమ్మికుంట పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతాంగానికి సమాధానం చెప్పాలి.**
**– కాంగ్రెస్ ప్రభుత్వానికి జరగబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలి..**
**–బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి.....**

కరీంనగర్, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి) తాలు, తరుగు,



తేమ తో సంబంధం లేకుండా వడ్లను కనీస మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని మేనిఫెస్టోలో చెప్పిన కాంగ్రెస్ నేడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందని , వడ్ల కొనుగోళ్లలో కళ్ళముందే మోసం చేస్తుంటే , రైతులను నిలువు దోపిడీ చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడంలేదని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ప్రశ్నించారు. ఇల్లందకుంట మండలంలో స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి గంగాడి కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలు, తేమ, తరుగుతో సంబంధం లేకుండా వడ్లన్నీ కోనాలంటే ప్రభుత్వంపై పడుతున్న వందల కోట్ల భారం పడుతుందని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం జంకుతున్నదన్నారు. వందలకోట్ల నిధులకే భయపడే కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ అమలు కోసం వేలకోట్ల రూపాయలు ఎక్కడినుండి తీసుకువస్తుందన్నారు. ఇచ్చిన హామీలనే అమలు చేయలేని కాంగ్రెస్ పార్టీని ఎవరు విశ్వసించే పరిస్థితి లేదన్నారు .డిసెంబర్ కల్లా రైతుకు రెండు లక్షల రుణ మాఫీ వడ్లకు 500 బొనస్ , ఎకరాకు 15 వెలు రైతు భరోసా ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చాక మొండి చెయ్యి చూపి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రైతుల ఓట్లు అడిగే హక్కు లేదని దుయ్యబట్టారు. తాలు తరుగు పేరుతో రైతుల కల్లాలవద్ద దోచుకున్న బందిపోటు దొంగల్లా నేడు పరిస్థితులు ఉన్నాయన్నారు. రైతుల సంక్షేమం అభివృద్ధి కోసం కేంద్రంలోని బిజెపి మోదీ ప్రభుత్వం గత పదేళ్లుగా కట్టుబడి పని చేసిందన్నారు.రైతులకు వివిధ రకాల ఎరువుల కోసం ఎకరాకు 30 వేల ఎరువుల సబ్సిడీ,ప్రతి రైతుకూ ఆరు వేల కిసాన్ నిదినాణ్యమైన విద్యుత్తు, పంటల కి మద్దతు ధర పదేళ్లలో 50% పెరుగుదల , రామగుండం ఎరువుల కర్మాగారం 6500 కోట్ల తో పునరుద్ధరించిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. మంగళవారం జమ్మికుంట పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కోసం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన అంశాలను ఎప్పటిలోగా అమలు చేస్తారో సమాధానం చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ డిమాండ్ చేశారు. జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులంతా తగిన గుణపాఠం చెప్పాలని, రైతుల శ్రేయస్సు అభివృద్ధి కోసం నిరంతరం ఆలోచన చేస్తూ కృషి చేస్తున్న బిజెపి మోడీ ప్రభుత్వాని కి రైతాంగం మద్దతుగా నిలవాలని, కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

**–బెల్ట్ షాపులకు మందు విక్రయిస్తే చర్యలు తప్పవు**
**–వేములవాడ డిఎస్పీ నాగేంద్రచారి**

వేములవాడ, ఏప్రిల్ 29: నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్ యజమానులు బెల్ట్ షాప్ నిర్వహించే వారికి మందు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని వేములవాడ డిఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో, పట్టణాల్లో ఉన్న బెల్ట్ షాప్ ల పై దాడులు నిర్వహించి, 55 కేసులల్లో 31,2,374 రూపాయల విలువ గల 584 లీటర్ల మద్యం సీజ్ చేయడం జరిగిందని అన్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 68 కేసులల్లో 255500 రూపాయలు విలువ గల 417 లీటర్ల మద్యం సీజ్ చేసి, ఉక్కుపాదం మోపడం జరిగిందని తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లోని ఇండ్లలో, హోటల్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో, కిరాణా షాపులలో, ఇతర దుకాణాలలో నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ప్రభుత్వ పర్మిషన్ లేకుండా అక్రమంగా బెల్ట్ షాప్ నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైన్స్ యజమానులు కూడా నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాప్ నిర్వాహకులకు మద్యం విక్రయాలు జరిపితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని డిఎస్పీ హెచ్చరించారు.

# కిడ్స్ కాన్వెంట్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి): : వేములవాడ పట్టణంలోని కిడ్స్ కాన్వెంట్ హై స్కూల్ లో ఐదవ తరగతి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే 1వ తరగతి నుండి 9వ తరగతి వరకు ర్యాంక్ హోల్డర్స్ కు ప్రథమ, ద్వితీయ ర్యాంకర్స్ కు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో భాగముగా విద్యార్థులు కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్, మెడల్స్, బహుమతులు అందుకున్నారు. విద్యార్థులు స్పీచ్ లు, డాన్స్ లతో అందర్నీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నరాల దేవేందర్, డైరెక్టర్ ఫసి, ప్రిన్సిపాల్ ధరక్షన్ వసుపియా, టీచర్స్ పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

**–నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్లహరి శంకర్**



కరీంనగర్, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి) ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని కరీంనగర్ నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్లహరి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం నగరంలోని 37 వ డివిజన్, 55వ డివిజన్ లో నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మరోసారి అభివృద్ధికి పట్టం కట్టాలని బిఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ కే ఓటు వేసి బారి మెజార్టీ తో గెలిపించాలని కోరారు. గడప గడపకు వెళ్లి కాంగ్రెస్ బిజెపిల వైఫల్యాన్ని ఎండగడుతూ వినోద్ కుమార్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు తేలేని అసమర్థ ఎంపీ బండి సంజయ్ అని విమర్శించారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపిలకు కర్రు కాల్చి వాత పెట్టేందుకు కరీంనగర్ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కరీంనగర్లో బిఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ కు మద్దతుగా నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చల్ల హరిశంకర్ డివిజన్ ల్లో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారన్నారు. వినోద్ కుమార్ తోనే కరీంనగర్ అభివృద్ధి సాధ్యమని, కరీంనగర్ కు స్మార్ట్ సిటీ జాతీయ రహదారులు రైల్వే లైన్లు తెచ్చిన ఘనత వినోద్ కుమార్ దన్నారు. ఈ కార్యక్రమంలో 37వ డివిజన్ అధ్యక్షులు అరె రవి గౌడ్, 55వ డివిజన్ అధ్యక్షులు చేతి చంద్రశేఖర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజామాబాద్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి నిరసన సెగ.. ఆరు గ్యారంటీలపై జీవన్రెడ్డిని నిలదీసిన ప్రజలు

నిజామాబాద్, ఏప్రిల్ 29: లోక్సభ ఎన్నికల ప్రచారానికి వెళున్న కాంగ్రెస్ నాయకులపై ప్రజలు తిరగబడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలుపై ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. ఈ క్రమంలో నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్రెడ్డికి (ఓఒఅ ఏవవలజీని ఖీవటటఎ) నిరసన సెగ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి జీవన్రెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తుండగా.. అడ్డుతగిన మహిళలు, ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఆసరా పెన్షన్ ఇప్పటి వరకు ఎందుకు పెంచలేదని వృద్ధులు నిలదీశారు.

జనవరి నెలలో ఎగ్గొట్టిన పింఛన్ ఎప్పుడు ఇస్తారని అడిగారు. కల్యాణలక్ష్మి చెక్కులు, తులం బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. మాయమాటలు చెప్పి మళ్లీ ఓట్లడుగుతున్నారని మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐదు ఎకరాల కంటే అధికంగా ఉన్నవారికి రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదని రైతులు నిలదీశారు. రూ.2 లక్షల రుణమాఫీ ఎందుకు చేస్తలేరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ఎక్కడ? మీరు ఇప్పటి వరకు మాకు ఏమైనా చేసారా అంటూ ప్రశ్నించారు. జీవన్ రెడ్డి ప్రసంగానికి అడ్డుతగలొద్దని ఎమ్మెల్యే వారించినప్పటికీ వారు ఎంతకూ శాంతించకపోవడంతో మధ్యలోనే ప్రచారాన్ని ముగించుకుని ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# అనంతపల్లిలో ఘనంగా శ్రీరాముని బ్రహ్మోత్సవాలు

**–బీఆర్ఎస్ నేత చెల్మెడ ప్రత్యేక పూజలు**

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి



మండలం అనంతపల్లి గ్రామంలోని శ్రీ రాములవారి బ్రహ్మోత్సవాలకు సోమవారం వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాముడిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, నాయకులు బైరగోని రమేష్, మాజీ సర్పంచ్ ఐతం అంజయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు అనంతుల మోహన్, ఐతం తిరుపతి, ఐతం మహేష్, మెరుపుల పర్శరాములు, ఐతం శ్రీనివాస్, హరీష్, తదితరులు ఉన్నారు.

# కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ ని భారీ మెజారిటీతో గెలిపించాలి

**–బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, ఎంపిపి బండ మల్లేశం**



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 29: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలంలోని గ్రామాలలో సోమవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంటు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, ఎంపిపి బండ మల్లేశంలు ఇంటింటా తిరుగుతూ భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

ప్రపంచ దేశాల్లో భారత్ ని అగ్రగామిగా చేసే సత్తా నరేంద్ర మోడీకి ఉందని, కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం బండి సంజయ్ గెలిచాకే అభివృద్ధి బాటలో ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కెన్యాలో ఘోర ప్రమాదం.. డ్యామ్ కూలి 42 మంది మృతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 29: ఆఫ్రికా దేశమైన కెన్యాలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఓ డ్యామ్ కూలి సుమారు 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.

ఈ మేరకు స్థానిక అధికారులు తాజాగా వెల్లడించారు.

కెన్యాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఫలితంగా ఆకస్మిక వరదలు సంభవించాయి. దేశంలోని పలు ప్రధాన డ్యామ్లు, నదులు నిండి ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. నీటి ఉధృతికి పలు డ్యామ్లు కూడా కొట్టుకుపోతున్నాయి.

ఈ క్రమంలో తాజాగా పశ్చిమ కెన్యాలోని రిఫ్ట్ వ్యాలీ (ఖీతిటబి ఎజీశ్రీశ్రీవఎ)లో గల కిజాబె డ్యామ్ నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఆ నీరంతా దిగువ గ్రామాల్లోకి పోటెత్తడంతో సుమారు 42 మంది నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి మరణించినట్లు నకురు కౌంటీ గవర్నర్ సుసాన్ కిహికా తెలిపారు.

నీటి ఉధృతికి పలు ఇళ్లు, రోడ్లు కూడా కొట్టుకుపోయాయని, బురదలో మరికొంత మంది చిక్కుకుపోయినట్లు చెప్పారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇక భారీ వర్షాలకు గత నెలలో సుమారు 100 మంది మరణించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.